వామ్మో.. వయ్యారిభామ

విషపూరితమైన కలుపు మొక్క | అతివేగంగా పెరిగే ప్రమాదకారి | పంటలు, మనుషులపై తీవ్రమైన ప్రభావం | జాగ్రత్తలు తప్పనిసరి: అధికారులు, వైద్యులు

వయ్యారిభామ అనే అందమైన పేరు కలిగిన ఈ మొక్క అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్క. వేగంగా వ్యాపించే ఈ మొక్క తక్కువ కాలంలోనే ఏపుగా పెరిగి పంటలను నిర్వీర్యం చేస్తుంది. దీంతో పంట దిగుబడి గణనీయంగా పడిపోతుంది. ప్రజలు, పశువుల ఆరోగ్యంపై కూడా తీవ్రమైన ప్రభావం చూపిస్తుంది.


పొలమంతా వ్యాపించిన వయ్యారిభామ కలుపు మొక్కలు

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ ప్రాంతాల్లో వయ్యారిభామగా పిలుచుకునే ఈ విషపు కలుపుమొక్కల పేరు వింటే చాలు రైతులు హడలిపోతుంటారు. ఈ మొక్కలు పంటలో పెరిగితే దిగుబడులు తగ్గిపోతాయి. ఇళ్ల మధ్య పెరిగితే మనుషులు, పశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

విష రసాయనాలే..

ఈ మొక్కలను కాంగ్రెస్ గ్రాస్ అని, పార్థీనియం అని కూడా వ్యవహరిస్తుంటారు. ఈ మొక్కల్లో మొత్తమంతా విషపదార్థాలే నిండి ఉంటాయి. ఏప్రిల్– నవంబరు మధ్య కాలంలో పెరుగుతాయి. దాదాపు 1.5మీటర్ల ఎత్తు వరకు పెరిగి దాని విత్తనాలను చాలా దూరం వరకు వ్యాప్తి చేస్తుంది.

మనుషులు, పంటలకు నష్టమే..

కొత్త మీర మొక్కలను పోలిన ఈ కలుపు మొక్కలు చిన్న చిన్న తెలుపురంగులో పూలు పూస్తాయి. ఒక్కో మొక్క 80వేల సంఖ్యలో విత్తనాలను గాలి ద్వారా వెదజల్లుతాయి. దీంతో అతి తక్కువ సమయంలోనే లక్షల్లో ఈ మొక్కలు పెరిగిపోతాయి. ఈ మొక్కల పుష్పాల నుంచి వెదజల్లే పుప్పొడి వల్ల మనుషుల్లో శ్వాస సమస్యలు, చర్మ సంబంధిత అలెర్జీలు వస్తాయి.

నిర్మూలించాల్సిందే

వయ్యారిభామ కలుపు మొక్కలు ఇళ్ల మధ్య పెరగకుండా ఎప్పటికప్పుడు కూకటి వేళ్లతోసహా పీకివేసి మట్టిగుంతల్లో పాతిపెట్టాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడేవారు ఈ మొక్కలకు దూరంగా ఉండటం ఉత్తమం. నిర్లక్ష్యం వహిస్తే అనారోగ్యం బారిన పడక తప్పదని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.


పుప్పొడి వెదజల్లే దశలో..

ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి



వయ్యారి భామ కలుపు మొక్కలు ఉన్న చోట ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి మొక్కలు ఉన్న చోట దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మరింత అస్వస్థకు గురయ్యే ప్రమాదం ఉంది. మొక్కలు పుష్పాలు పూయకముందే అరికట్టాలి. వీటిని కాలిస్తే వెలువడే విషవాయుల వల్ల కూడా ప్రమాదమే. ఆ విషపు పొగతో వ్యాధిగ్రస్తులు మరింత అస్వస్థకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది.

– లింగమూర్తి, సీహెచ్ఓ, పీహెచ్‌సీ, మిరుదొడ్డి

పంటల దిగుబడిపై ప్రభావం



వయ్యారిభామగా పిలువబడే పార్థీనియం కలుపు మొక్కలు పంట పొలాలు, చేల గట్లు, ఖాళీ ప్రదేశాల్లో కాస్త తడి తగిలితే చాలు ఏపుగా పెరుగుతాయి. ఈ మొక్కలు పుష్పించకముందే చేతులకు పాలిథిన్ కవర్లు తొడుక్కుని కూకటి వేళ్ళతోసహా పీకివేసి మట్టిలో పాతిపెట్టాలి. అప్రమత్తంగా లేకపోతే ఈ కలుపు మొక్కలు వ్యాపించి పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది.

– సమ్రీన్, ఏఈఓ, మిరుదొడ్డి

ఆలయం వద్ద రాజకీయాలు చేయొద్దు

- ఏర్పాట్లు సంతృప్తికరంగా లేవు
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న సన్నిధిలో రాజకీయాలు చేయవద్దని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణానికి కార్యకర్తలతో కలసి ఆదివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆలయం వద్ద కొంత మంది కావాలని రాజకీయం చేస్తున్నారని అది వారికే మంచిది కాదన్నారు. కల్యాణం ఏర్పాట్లు సంతృప్తికరంగా లేవని, అధికారులు మెరుగైన ఏర్పాట్లు చేసి ఉండాల్సిందని అన్నారు. సంక్రాంతి తర్వాత ప్రారంభం కానున్న స్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

మా ఇంటి ఇలవేల్పు

మాఇంటి ఇలవేల్పు కొమురవెల్లి మల్లికార్జున స్వామి అని మేడ్చేల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. స్వామి కల్యాణానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తప్పకుండా హాజరవుతానని చెప్పారు. స్వామి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

నిప్పుపెట్టిన దుండగులను శిక్షించాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


స్కూల్ వాహనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మిరుదొడ్డి(దుబ్బాక): స్కూల్ వాహనాలకు నిప్పుపెట్టి దహనం చేసిన దుండగులను వెంటనే గుర్తించి శిక్షించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో ఇటీవల గోల్కొండ మోడల్ స్కూల్‌కు చెందిన రెండు వాహనాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి దహనం చేశారు. విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం స్కూల్ వాహనాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ రవిని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, మల్లన్న బండ ఆలయ కమిటీ చైర్మన్ లింగాల వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కొమ్మాట బాలకృష్ణ, కంచం యాదగిరి తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో ఉద్యోగులకు 50శాతం పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు వంగ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పీఆర్టీయూ భవన్‌లో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ కార్పొరేట్ ఆస్పత్రులలో ఉచితంగా వైద్యం అందించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ, విజయాశుభాకర్ రెడ్డి, ఆస లక్ష్మణ్, ముత్యాల సురేందర్ రెడ్డి, వరదరాజులు, కొమ్మురి పద్మ, పాతూరి సుజాత, రమాదేవి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై మొక్కజొన్న విత్తనాలు

జిల్లా వ్యవసాయ అధికారి రాధిక


విత్తనాల పంపిణీ ప్రారంభిస్తున్న రాధిక

మర్కుక్(గజ్వేల్): మండలంలోని గణేశ్‌పల్లిలో జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, ములుగు సహాయ వ్యవసాయ సంచాలకుడు అనిల్‌కుమార్ ఆదివారం మొక్కజొన్న విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ మండలంలో పత్తిని తీసివేసి మొక్కజొన్న సాగుచేసే వారికి జాతీయ ఆహార భద్రత మిషన్–మొక్కజొన్న పథకంలో భాగంగా రూ.1375లు విలువచేసే 5కిలోల బయోసీడ్ 9544 హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలను రూ.500 సబ్సిడీ పోగా రూ.875కే అందజేస్తున్నారని చెప్పారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకొని హనుమాన్ ఫర్టిలైజర్స్‌లో పొందవచ్చని చెప్పారు. మండలానికి 200 ప్యాకెట్లు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి వసంతరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు విష్ణుయాదవ్, రజనీకాంత్‌గౌడ్, మీనాక్షి, రైతులు పాల్గొన్నారు.

రేపు విచారణ..

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీలో పనిచేసే ఉద్యోగి శ్రీనివాస్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదు మేరకు 31న విచారణ జరిపించాలని వరంగల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌కు శనివారం ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. మున్సిపల్ కార్యాలయంలో రెండు వర్గాల వాదనలు, అభియోగాలు పరిశీలించాలని సూచించారు.

2న హుండీ లెక్కింపు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు జనవరి 2వ తేదీన లెక్కించనున్నట్లు ఈఓ కిషన్‌రావు ఆదివారం తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2గంటలకు ఆలయ మండపంలో లెక్కిస్తారని, ఆసక్తి గల భక్తులు, గ్రామ ప్రముఖులు పాల్గొనవచ్చని చెప్పారు.

జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు


ఆలయాన్ని సందర్శిస్తున్న ఆర్‌జేసీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): జనవరి నుంచి ప్రారంభమయ్యే కొండపోచమ్మ ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు ఆదేశించారు. కొండపోచమ్మ ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతియేటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే కొండపోచమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేకంగా వాలంటరీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

భక్తుల సందడి..

ఆదివారం కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం అనంతరం భక్తులు కొండపోచమ్మ దర్శనానికి బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈఓ రవికుమార్, సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, హరి, చిన్నా, లక్ష్మణ్, చందు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటే లక్ష్యం

- అంత వరకు పోరాటం ఆగదు
- సీఐటీయూ నేత వెంకటచారి

గజ్వేల్‌రూరల్: హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేసే వరకు తమ పోరాటం ఆగదని సీఐటీయూ నాయకుడు వెంకటచారి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో ప్రమాదాల బారిన పడిన హమాలీ కార్మికులను ఆదుకొనేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. వారికి గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ లాంటి సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ గోదాములలో పనిచేసే హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు కార్మికులకు ఇళ్లు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హమాలీ కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు వెంకటచారి

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ నర్సాపూర్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

– డీఎంహెచ్ఓ పల్వన్‌కుమార్

సిద్దిపేటకమాన్: జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను నిబంధనలకు అనుగుణంగా నడపాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులలో పేషెంట్లకు అందించే వైద్య సేవలకు వారి నుంచి తీసుకునే చార్జీలను ధరల పట్టిక రూపంలో తప్పకుండా ప్రదర్శించాలన్నారు. అనుమతి లేకుండా ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లను నిర్వహించినా, నిబంధనలను అతిక్రమించినా ఆయా యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం


ఎంపికైన నూతన కార్యవర్గం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆదివారం గజ్వేల్‌లో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య డివిజన్ అధ్యక్షుడిగా దేశపతి శంకరశర్మ, ఉపాధ్యక్షులుగా రాయారావు విశ్వేశ్వరరావు, రాయపోలు వెంకటేశ్వరశర్మ, ప్రధాన కార్యదర్శిగా రేవల్లి రవీందర్‌రావు, సహాయ కార్యదర్శులుగా కొడకండ్ల రామదత్తుశర్మ, నల్లదీగ వరదాచార్యులు, కోశాధికారిగా విఠాల కృష్ణమూర్తిశర్మను ఎంపిక చేశారు. అదే విధంగా యువ పరిషత్ అధ్యక్షుడిగా విఠాల సాయికృష్ణశర్మ, ప్రధాన కార్యదర్శిగా నందగిరి శ్యాంప్రసాద్‌శర్మ, కోశాధికారిగా మామురాల రాఘవేందర్‌రావు, ఉపాధ్యక్షుడిగా కొడకండ్ల శివకుమార్‌శర్మ, దేశాయి కార్తీక్‌శర్మతో కూడిన నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఎన్నికల అధికారి దేశపతి రాజశేఖరశర్మ, బెజుగామ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విఠాల నృసింహరామశర్మ, జాలిగామ సుధాకర్‌రావు, బెజుగామ నాగేందర్‌రావు, రేవల్ల జితేందర్‌రావు, రాంప్రసాద్‌రావు, షబ్నవీసు హన్మంతరావు, చాడ నందబాలశర్మ, శేషం శ్రీనివాసాచార్యులు, విఠాల శ్రీనివాసశర్మతో పాటు బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు


కూడవెల్లి బ్రిడ్జి సమీపంలోని మూల మలుపు

మిరుదొడ్డి(దుబ్బాక): రోడ్ల మూల మలుపుల్లో ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేక పోవడంతో ప్రమాదాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించేలోపే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల కేంద్రమైన మిరుదొడ్డి నుంచి లింగుపల్లి శివారులోని కూడవెల్లి హైలెవల్ బ్రిడ్జి వరకు ఉన్న పలు మూల మలుపుల్లో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా ఇటీవల పలువురు వాహనదారులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా మూల మలుపుల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రారంభ యోగం లేదా?

- నిర్మాణం పూర్తయిన యోగా షెడ్డు
- రెండేళ్లగా పట్టించుకొనే నాథులు లేరు
- పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలు



పీహెచ్‌సీ ఎదురునిర్మించిన యోగా షెడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆయుష్ మిషన్ ద్వారా అక్కన్నపేట మండలానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో యోగా షెడ్డు మంజూరైంది. ఈ షెడ్ నిర్మాణానికి సుమారు రూ.6లక్షల వరకు నిధులు కేటాయించారు. దీంతో నిర్మాణ పనులు పూర్తయి దాదాపు రెండేళ్లు దాటుతోంది. అయినా ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు.

శిథిలావస్థకు..

యోగా శిక్షణ కోసం నిర్మించిన షెడ్డు నిర్మాణ పనులు పూర్తికాగా ప్రారంభానికి అడుగులు పడలేదు. రెండేళ్ల క్రితమే నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ యోగా శిక్షకులను నియమించకపోవడంతో తెరుచుకోవడం లేదు. దీంతో ప్రస్తుతం ఈ యోగా షెడ్డు చుట్టూ పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. శిథిలావస్థకు చేరుకుంటోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అందుబాటులోకి తీసుకోరావాలని స్థానికులు కోరుతున్నారు.

ఏబీవీపీ రాష్ట్ర సభ్యుడిగా వివేక్ వర్ధన్



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా వివేక్ వర్ధన్‌ను ఎంపికచేసినట్టు జిల్లా కన్వీనర్ ఆదిత్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివేక్ గతంలో సిద్దిపేట నగర కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. ఇటీవల జరిగిన 43వ రాష్ట్ర మహాసభల్లో ఈ మేరకు నియామకం జరిగినట్టు పేర్కొన్నారు.

నేడు జాబ్‌మేళా

సదాశివపేట(సంగారెడ్డి): సిద్దాపూర్ రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బంగ్లా భారతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది పరిశ్రమల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరుకానున్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు ఆరుసెట్ల రెజ్యూమ్, రెండు ఫోటోలతో హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

సర్వే ఇళ్ల 'సూపర్ చెకింగ్'


రీ వెరిఫికేషన్ చేస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా నమోదుచేసిన వివరాలను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సూపర్ చెకింగ్ పేరుతో రీ వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 4,542 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. 85శాతం సర్వే పూర్తి చేశామని, సర్వే చేసిన ఇండ్లల్లో కొన్నింటిని తీసుకొని రీ వెరిఫికేషన్ చేస్తున్నట్లు చెప్పారు. ఎంపికలో నిష్పక్షపాతంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు.

కేజ్ వీల్స్‌తో నడిపితే చర్యలు


అవగాహన కలిపిస్తున్న కనకయ్య

కోహెడరూరల్(హుస్నాబాద్): రోడ్లపై కేజ్ వీల్స్‌లో ట్రాక్టర్‌లను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెడ్ కానిస్టేబుల్ కనకయ్య హెచ్చరించారు. మండలంలోని శనిగరం గ్రామంలో రైతులు, గ్రామస్తులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్‌లను కేజ్ వీల్స్‌తో నడుపడం వల్ల సీసీ, బీటీ రోడ్లు ధ్వంసమైవుతున్నాయని, అలాంటి ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. రూ.50వేల వరకు జరిమానాతోపాటు ఆరు నెలల జైలుశిక్ష విధించే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దుర్భర పరిస్థితుల్లో చేనేత కుటుంబాలు


వీరమోహన్‌కు నాయకుల సన్మానం

దుబ్బాక: ఆదరణ కరువవ్వడంతో చేనేత కార్మికుల కుటుంబాలు దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యవేదిక దుబ్బాక మండల అధ్యక్షుడిగా గోనె మధుసూదన్‌కు ఆదివారం ఆయన నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి చేనేత పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గాజుల తిరుపతి తదితరులు ఉన్నారు.

సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా చేనేత ఐక్యవేదిక సభ్యుల ప్రమాణ స్వీకారం హైదరాబాద్‌లో జరిగిందని, చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ధనుంజయ గార్డెన్లో ఆదివారం జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో బాధ్యతలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో జోగు భిక్షపతి, సిరిసిల్ల బాల కిషన్, ఎల్లారం శ్రీనివాస్, వేముల నగేశ్, ఉష, కోయిల గణేశ్, కొంక మహేశ్, పేర్ల రమేశ్, మాదురి బాలకిషన్, చేర్యాల నరేశ్, మంతెన రవి తదితరులు పాల్గొన్నారన్నారు.

సమాచారం అందజేయాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్

నంగునూరు(సిద్దిపేట): గంజాయి విక్రయించినా, ఎవరైనా వినియోగించినట్టు తెలిసినా సమాచారం అందజేయాలని ఎస్ఐ ఆసిఫ్ సూచించారు. సిద్దిపేట పోలీస్ హెడ్ క్వార్టర్ నుంచి వచ్చిన జాగిలాలతో ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లోని అనుమానిత ప్రాంతాలు, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలై భవిష్‌త్‌ను నాశనం చేసుకోవద్దన్నారు.

ఆర్‌హెచ్‌పీ నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రీయ హిందూపరిషత్ (ఆర్‌హెచ్‌పీ) బెజ్జంకి మండల అధ్యక్షుడిగా దాచారం గ్రామానికి చెందిన బండిపెల్లి సత్యనారాయణను నియమిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి అఖిల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన కమాలేశ్ రాజపుత్ర, జిల్లా అధ్యక్షుడు బండి అఖిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.